క్లుప్తంగా

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

వీరపునాయునిపల్లె: మండల కేంద్రంలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడి కార్యకర్తలకు జీవనజ్యోతి కార్యక్రమంపై శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాదిక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి విడత 18,19, 20వ తేదీ వరకు రెండవ విడత 22,24,25 తేదీల్లో శిక్షణా తరగతులు చేపడుతామని పేర్కొన్నారు. ఈ శిక్షణకు మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు హాజరుకావాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని వేంపల్లి రోడ్డు, వడ్డెర కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీరామాలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ మహోత్సవాలు ఈ నెల 19వ తేదీ వరకు ఆలయంలో వివిధ రకాల పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 19వ తేదీన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామని, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఆప్కాస్ విధానం కొనసాగించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

జమ్మలమడుగు: ఆప్కాస్ విధానాన్ని ప్రభుత్వం కొనసాగించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ విధానం తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్ విధానం రద్దు చేయడం వలన కార్మికులకు ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య ఇంజినీరింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధర్, సహాయ కార్యదర్శి మురళి, యాకోబు పాల్గొన్నారు.

గండి ఆలయ టెండర్లు వాయిదా

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం నిర్వహించిన తలనీలాల సేకరణ, ఒక భాగం కొబ్బరి చిప్పల సేకరణ హక్కులకు నిర్వహించిన టెండర్లను వాయిదా వేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. టెండర్లలో పాల్గొనేందుకు ఎవరూ మొగ్గు చూపకపోవడంతో వాయిదా వేసినట్లు చెప్పారు. తిరిగి ఈ నెల 24న మూడవ దఫా టెండర్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్‌లు వెంకటస్వామి, వీరభాస్కరుడు, కడప దేవదాయశాఖ అధికారి శివయ్య పాల్గొన్నారు.


అలరించిన నాట్య ప్రదర్శన



చిన్నారులతో డ్యాన్స్ మాస్టర్

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీ రంగనాథ స్వామి కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన చిన్నారుల నాట్య ప్రదర్శనలు అలరించాయి. శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి శ్రీ రాజా కళా నిలయం డ్యాన్స్ మాస్టర్ రాజా నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల అద్భుత నాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా చిన్నారులు నృత్య ప్రదర్శనలు చేశారు.

అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

లింగాల : మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో సోమవారం రాత్రి వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన మేనకోడలు నవీన జయంతి సందర్భంగా మేనత్త లక్ష్మీదేవి, మామ గంగాధరరెడ్డిలు వృద్ధులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

ముద్దనూరు: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ముకుందరెడ్డి తెలిపారు. రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు కుల, ఆదాయ, బ్యాంక్ అకౌంట్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు ఒరిజినల్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీలో యువ యోగ సాధకులు

- 4,755 సూర్య నమస్కారాల ప్రదర్శన
- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సత్తా
- విద్యార్థులకు ప్రశంసలు



వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమంలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)



పతకాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్

వేంపల్లె : తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లాలో ఇటీవల నిర్వహించిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమంలో ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. వీరంతా కలసి 4,755 సూర్య నమస్కారాలు ప్రదర్శించి సత్తా చాటారు. వీరిలో విజయ్ (ఇ2) 1,456 సూర్యనమస్కారాలతో మొదటి స్థానంలో నిలవగా.. భరణి గోవింద్ (పీ2) 751, రెడ్డి రియాజ్ (పీ2) 680, యశ్వంత్ (పీ2) 629, రవితేజ (ఇ2)625, అరవింద్ (ఇ2) 614 సూర్యనమస్కారాలు పూర్తి చేసి ప్రతిభను కనబరిచారు. వీరిలో విజయ్ నిరవధికంగా 9 గంటల పాటు ఆహారం తీసుకోకుండా, విశ్రాంతి లేకుండా ప్రదర్శన కొనసాగించాడు. దీంతో ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా ఆరుగురు విద్యార్థులను, యోగాధ్యాపకులను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వీరు సాధించిన ఘనత తమకెంతో గర్వ కారణంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించడానికి కారణమైన యోగాధ్యాపకురాలు వి.లక్ష్మీభారతిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవి కుమార్, డీన్ ఆఫ్ అకడమిక్స్ రమేష్ కైలాష్, పఠాన్ మొహిదీన్ ఖాన్, నవీన్ కుమార్, మహమ్మద్ రఫీ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఆనందంగా ఉంది



వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమంలో 1,456 సూర్య నమస్కారాలు చేసి మొదటి స్థానంలో నిలవడం ఆనందంగా ఉంది. గత మూడేళ్లుగా యోగాభ్యాసం చేస్తున్నారు. అండర్–25 బాలుర విభాగంలో తృతీయ స్థానంలో నిలిచాను. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించడమే నా లక్ష్యం.
– విజయ్, ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ఇంజినీరింగ్ విద్యార్థి, ఇడుపులపాయ

సీనియర్లే స్ఫూర్తి



వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమంలో 751 సూర్య నమ్కారాలు చేసిన ప్రతిభ కనబరిచాను. యోగాభ్యాసనాలు చేయడంలో సీనియర్లే స్ఫూర్తి. భవిష్యత్‌లో మరిన్ని యోగ కార్యక్రమాలలో పాల్గొని పతకాలు సాధిస్తాను. జాతీయ స్థాయిలో పాల్గొని పతకాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా.
– భరణి గోవింద్,ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ఇంజనీరింగ్ విద్యార్థి, ఇడుపులపాయ

యోగ అంటే ఆసక్తి



యోగం అంటే నాకు ఎంతో ఆసక్తి. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమంలో 680 సూర్య నమ్కారాలు చేశాను. భవిష్యత్‌లో యోగ మరింత ప్రావీణ్యం సాధించి యోగాసనాలు అద్భుతంగా చేసి పతకాలు సాధిస్తా. జాతీయస్థాయిలో పతకం సాధించడమేలక్ష్యంగా పెట్టుకున్నాను.
– రెడ్డి రియాజ్, ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ఇంజనీరింగ్ విద్యార్థి, ఇడుపులపాయ

నేటి నుంచి ఆధార్ నమోదు కేంద్రాలు

ముద్దనూరు: మండలపరిధిలో మంగళవారం నుంచి సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు మండలపరిషత్ అభివృద్ధి అధికారి ముకుందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18,19వ తేదీల్లో తిమ్మాపురంలో, 20, 21న పెనికలపాడు–1లో, 18,21న ముద్దనూరు–2 సచివాలయంలో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేంద్రాల్లో 0 నుంచి 5 సంవత్సరాల వారికి ఆధార్ అప్‌డేట్ చేయుట, ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పు, ఆధార్‌కార్డుకు ఫోన్ నంబరు లింక్ చేస్తారని ఎంపీడీఓ తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొలతల క్షేత్రానికి వాహనాల్లో రావద్దు

పెండ్లిమర్రి: పొలతల శైవ క్షేత్రానికి నీరు కోన వద్ద నుంచి గుడి వరకు తారు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, పొలతల క్షేత్రానికి వచ్చే భక్తులు నాలుగు రోజుల పాటు కార్లు, ట్రాక్టర్ల, లారీల్లో కాకుండా ద్విచక్ర వాహనాల్లో రావాలని ఆలయ ఈఓ క్రిష్ణానాయక్, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలతల ఘాట్ రోడ్డులో రోడ్డు పనులు జరుగుతున్నందున కేవలం ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతిస్తామని పేర్కొన్నారు. ఈవిషయాన్ని భక్తులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని కోరారు.

డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించిన అధికారులు



దయాలసిస్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నజీర్ అహమ్మద్

సాక్షి ఎఫెక్ట్..

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని పాత ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఉన్న డయాలసిస్ సెంటర్‌లో మద్యం బాటిళ్లు లభ్యమైన విషయాన్ని ఈనెల 15వ తేదీన సాక్షి పత్రికలో వార్త ప్రచురితమైంది. డయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ రోగులకు మెరుగైన వైద్యం అందించకుండా సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని డయాలసిస్‌కు వెళ్లే రోగులు, రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పులివెందులలోని డయాలసిస్ సెంటర్‌ను ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్ నజీర్ అహ్మద్ సోమవారం పరిశీలించారు. డయాలసిస్ సెంటర్‌లో సిబ్బంది భోజనం చేసేందుకు ప్రత్యేక గది ఉంది. ఇక్కడ వాచ్‌మెన్ కానీ, సిబ్బంది కానీ ఎవరూ లేకపోవడంతోపాటు డయాలసిస్ సెంటర్‌కు తలుపులు లేకపోవడంతో ఆకతాయిలు ఇక్కడికి వచ్చి మద్యం సేవించినట్లు వారు తెలిపారు. అందువల్ల ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి గట్టిగా వార్నింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. సిబ్బంది పరిధిలో ఉండే గదులుకు తాళాలు వేసుకోవాలని. ఏమైనా జరిగితే సిబ్బందే బాధ్యత వహించాలని హెచ్చరించారు. డయాలసిస్ సెంటర్‌ను తనిఖీ చేసినట్లు కలెక్టర్‌కు నివేదికలు పంపుతామన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



పులివెందుల రూరల్ : ఆర్డీఓ చిన్నయ్యకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



ముద్దనూరు: ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పులివెందుల రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సోమవారం పులివెందుల పట్టణంలో మినీ సెక్రెటరీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు తమకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మారుస్తూ జీఓ విడుదల చేయాలని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, సీడీపీఓ శ్రీలతకు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు, అనేక సేవలు అందిస్తున్నారని తెలిపారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు వేతనం ఇవ్వాలని కోరారు. ఆర్డీఓ, సీడీపీఓ స్పందిస్తూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సలీమా, సుధ, స్వప్న, మమత, శ్రీలత, స్రవంతి, వెంగమ్మ, అపర్ణ, లావణ్య, సుజాత, భారతి పాల్గొన్నారు.

ముద్దనూరు: అంగన్‌వాడీ వర్కర్లు,హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు కళావతి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ మంజూరు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ల పోస్టులు భర్తీ చేయాలని, మెనూ చార్జీ పెంచాలని డిమాండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న డాక్టర్ కుమార్

సింహాద్రిపురం : ప్రకృతి సేద్యంతో పండించిన ఆహార ఉత్పత్తులతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ కుమార్ తెలిపారు. సోమవారం సింహాద్రిపురంలోని ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు దుంప జాతి, ఇతర పండ్ల రకాలతో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమార్ మాట్లాడుతూ ప్రజలంతా ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిన ఆహార పదార్థాలను తీసుకుంటే చాలా మంచిది అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎంటీ రవీంద్ర గౌడ్, డివిజనల్ ఎంటీ నాగ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పండించిన ఉత్పత్తుల ద్వారా మాత్రమే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, వీటిని తక్కువ ధరలకే తమ సిబ్బంది ద్వారా విక్రయిస్తున్నామని తెలిపారు. మోడల్ మేకర్ ఐవీ రమణ, పీఆర్పీలు శ్రీనివాసులు, రిబిక, జయమ్మ, జయప్రకాష్, లక్ష్మీదేవి, ఏఎస్ఎంలు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన ఇన్నోవా

ముద్దనూరు: మండలంలోని తిమ్మాపురం సమీపంలో సోమవారం ఇన్నోవా వాహనం బోల్తాపడింది. వాహనంలో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. ఈ ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు కడప నగరానికి చెందిన వ్యక్తులు వాహనంలో గండికోట పర్యాటక కేంద్రానికి బయలుదేరారు. తిమ్మాపురం సమీపానికి రాగానే వేగంగా వస్తున్న వాహనాన్ని డ్రైవర్ అదుపు చేయలేక పల్టీలు కొట్టి బోల్తాపడింది. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జాగ్రత్తలతో హెచ్‌ఐవీ నివారణ

మైదుకూరు : ముందు జాగ్రత్తలు పాటించడం ద్వారా హెచ్‌ఐవీని నివారించవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి జ్యోత్స్న అన్నారు. మైదుకూరులో సోమవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం వారు హెచ్‌ఐవీ, సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సురక్షితం కాని లైంగిక సంపర్కం, కలుషిత సూదులు, పరీక్షింపబడని రక్తం ఎక్కించుకోవడం ద్వారా హెచ్‌ఐవీకి గురవుతున్నారని తెలిపారు. ఆస్పత్రులలో హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని పేర్కొన్నారు.

నమ్మకమే పెట్టుబడిగా వ్యాపారం సాగించాలి



జేబీ ఏజెన్సీస్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: నమ్మకమే పెట్టుబడిగా వ్యాపారం సాగించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు జిలానీ బాషా రైల్వే గేటు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జేబీ వాటర్ ఏజెన్సీస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచి మేరకు సరుకులు సరఫరా చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రహోమం

జమ్మలమడుగు: మండల పరిధిలోని ప్రముఖ శైవక్షేత్రమైన కన్యతీర్థంలో వైభవంగా రుద్రహోమం నిర్వహించారు. సోమవారం ఆలయ చైర్మన్ శివనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు హరిహర నాథశర్మ స్వామి వారికి ప్రత్యేకంగా అలకరించి స్వామివారికి పూజలు నిర్వహించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో నరేన్ రామాంజనేయరెడ్డి

చింతకొమ్మదిన్నె : ఇప్పపెంట ఎంపీటీసీ నారే నాగరాజు కుమారుడు చెన్న కృష్ణ వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. సోమవారం కమలాపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజనేయరెడ్డి ఇప్పపెంట వెళ్లి వధూవరులు చెన్నకష్ణ, సాయితేజస్వినిలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చింతకొమ్మదిన్నె గ్రామంలో సోమవారం నిర్వహించిన గంగమ్మ తల్లి దేవరలో పాల్గొన్ని అమ్మవారికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ శాసనసభ్యుడు రవీంద్రనాథరెడ్డి, నరేన్ రామాంజనేయరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పార్వతమ్మ గారి విశ్వనాథ రెడ్డి, జయరామిరెడ్డి, కంది అయ్యప్ప తదితరులు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చెరువులో మట్టిని తరలించొద్దు

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు



టిప్పర్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు

వేముల : మండల కేంద్రమైన వేముల సమీపంలోని చెరువు నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులకు మట్టిని తరలించొద్దంటూ గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకున్నారు. సోమవారం సాయంత్రం మట్టిని సరఫరా చేస్తున్న టిప్పర్లను చెరువు వద్ద అడ్డుకుని నిరసన తెలిపారు. గత నెల రోజులుగా చెరువు నుంచి మట్టిని రోడ్డు పనులకు తరలిస్తున్నారని, ఇలా తరలిస్తే మరం తేలి చెరువు నీరు ఆవిరయ్యే ప్రమాదం ఉందని, దీనివల్ల చెరువులో నీరు నిల్వ లేకుండా పోతుందని తెలిపారు. చెరువులో మట్టిని కాకుండా కొండ సమీపంలో మట్టిని తోలుకునేందుకు స్థలం చూపిస్తామని రైతులు చెప్పినప్పటికి కంపెనీ ప్రతినిధులు వినకపోవడంతో టిప్పర్లను అడ్డుకున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. చెరువులో అడుగు మట్టిని తరలించడం వల్ల చెరువు కింద ఉండే పొలాల్లో నీరు ఊటలెత్తి పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మట్టిని తరలించవద్దని రైతులు కోరారు. ఈ లోపు పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పి తాత్కాలికంగా మట్టి తోలే పనులను నిలిపివేసి ఈ విషయంపై చర్చించి ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాతనే మట్టిని తోలుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు టిప్పర్లను వదిలేశారు.

సాక్షి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ



వేంపల్లె : విద్యార్థినికి మెటీరియల్ పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



ఎర్రగుంట్ల : విద్యార్థినులకు సాక్షి మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ–2 రామాంజనేయరెడ్డి

వేంపల్లె : సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో పదో విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తున్న ఉచిత స్టడీ మెటీరియల్‌ను సోమవారం వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాక్షి దినపత్రిక యాజమాన్యం విద్యార్థులు మెటీరియల్ ఉచితంగా అందజేయడం హర్షణీయమన్నారు. మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరి శ్రీనివాస్, పీఈటీ అధ్యాపకుడు ఆవుల వెంకట్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో పదో విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తున్న ఉచిత స్టడీ మెటీరియల్‌ను సోమవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓ–2 రామంజనేయరెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులకు ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలలకు ఉచితంగా పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. విద్యార్థులు ఈ మెటీరియల్ చదివి పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామంజనేయ రెడ్డి, ఎస్ఆర్ చలపతి పాల్గొన్నారు.

శ్రీరంగనాథస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీరంగనాథుడిని దర్శించుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల : పులివెందుల పట్టణంలో శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీరంగనాథస్వామి రథోత్సవ వేడుకలు కనుల పండువగా జరిగాయి. తేరు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డితోపాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, అంకాలమ్మ ఆలయ చైర్మెన్ బ్యాటరీ ప్రసాద్, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్ పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. రథోత్సవంలో శ్రీవేంకటేశ్వరుడు, రాముడు, ఇతర దేవతామూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పురు వీధుల్లో వైభవంగా రథోత్సవం నిర్వహించారు. రథంలాగే భక్తులకు దారి వెంబడి పట్టణ ప్రజలు నీళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. పులివెందుల పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి రంగనాథస్వామిని దర్శించుకున్నారు.

రేపు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

సింహాద్రిపురం : బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు ఒరిజినల్ అప్లికేషన్, విద్యార్హత సర్టిఫికెట్లు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు రెండు సెంట్లు తీసుకుని రావాలన్నారు. ఈ ఇంటర్వ్యూలు అన్ని బ్యాంకుల ప్రతినిధుల సమక్షంలో జరుగుతాయని తెలిపారు.

లింగాల : బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు రెండు సెంట్లు తీసుకుని రావాలని సూచించారు.

వీరపునాయునిపల్లె: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు బుధవారం బ్యాంక్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళీశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మద్యాహ్నం ఒంటి గంటల వరకు ఉరుటూరు, వీరపునాయునిపల్లె ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుల పరిధిలోని గ్రామాలకు చెందిన అభ్యర్థులకు.. ఎర్రగుంట్ల, పెద్ద చెప్పలి ఏపీజీబీ బ్యాంకుల పరిధిలోని గ్రామాలకు చెందిన అభ్యర్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

జమ్మలమడుగు: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నిసా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:30 నిమిషాలకు అంబవరం పంచాయతీ, దేవగుడి, గొరిగెనూరు, మోరగుడి, గూడెంచెరువు, పొన్నతోట, మధ్యాహ్నం రెండు గంటలకు పి.బొమ్మేపల్లి, గండికోట, పి.సుగుమంచిపల్లి, సున్నపురాళ్లపల్లి, పెద్దదండ్లూరు, ఉప్పలపాడు గ్రామ పంచాయతీలకు చెందిన అభ్యర్థులకు ఇంటరర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో రుణాల కోసం దరఖాస్తులు చేసిన అభ్యర్థులు దరఖాస్తులతోపాటు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పాసు పుస్తకాలు జిరాక్స్, విద్యార్హత పత్రాలు ఒరిజినల్‌తో హాజరుకావాలని సూచించారు.

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుగుబడిన వారికి, కాపు తదితరులకు అందిస్తున్న సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. అలాగే మండల పరిధిలో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఎంపీడీఓ సభాభవనంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణయ్య సోమవారం తెలిపారు.

కమలాపురం: కమలాపురం పట్టణ పరిధిలోని బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేస్తున్న యువతీ యువకులు బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు కుల, ఆదాయ, బ్యాంక్ అకౌంట్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు ఒరిజినల్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలని సూచించారు.